
క్లుప్తంగా

కదిరి ఏఓగా శ్రీహరినాయక్



కదిరి అర్బన్: కదిరి మండల ఏఓగా శ్రీహరినాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఏఓ శ్రీనివాసరెడ్డి కర్నూలు జిల్లా డోన్‌కు బదిలీ అయ్యారు. ఏఓ శ్రీహరి నాయక్ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని తెలిపారు.

నాగ మధుసూదన్ బాధ్యతల స్వీకరణ



తలుపుల: మండల వ్యవసాయ అధికారిగా పి.నాగ మధుసూదన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కదిరి భూ సంరక్షణ కేంద్రం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తించే షాదాబ్ గాండ్లపెంటకు బదిలీ అయ్యారు. ఏఓ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ కార్యాలయ సిబ్బంది సహకారంతో ఎప్పటికప్పుడు రైతుల సమస్యలను పరిష్కరించి, సూచనలు ఇవ్వాలని ఆయన తెలిపారు.

18న పాలిసెట్‌పై అవగాహన

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 18న పాలిసెట్ కౌన్సెలింగ్‌పై అవగాహన కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ రమ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

ఏఓగా లక్ష్మీప్రియ బాధ్యతల స్వీకరణ



నల్లచెరువు: మండల నూతన వ్యవసాయ అధికారిగా లక్ష్మీప్రియ కదిరి ఏడీఏ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గాండ్లపెంట మండలం నుంచి నల్లచెరువుకు బదిలీ అయ్యారు. నల్లచెరువు మండల వ్యవసాయ అధికారి భారతి తనకల్లు మండలానికి బదిలీ అయ్యారు.

షరతులు లేకుండా పథకాలు వర్తింపజేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కదిరి టౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ పారిశుధ్య ఎన్ఎంఆర్ కార్మికులకు షరతులు లేకుండా 'తల్లికి వందనం'తో సహా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జనార్దన్, తిరుపాల్, నరసింహమూర్తి, చిన్నక్రిష్ణ, సూరి, రాజు, శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు జగన్మోహన్, ముస్తక్ అలీ, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌పై అవగాహన



మాట్లాడుతున్న పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పాలిసెట్ కౌన్సెలింగ్‌పై అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ప్రక్రియను వివరించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సందేహాలను పరిష్కరించారు. పాలిసెట్ పూర్తి చేయడం ద్వారా భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు హరిబాబు, బాలజోషి, రాజేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌తో ప్రయోజనాలు



తాడిమర్రిలో ర్యాలీ చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

తాడిమర్రి: గ్రామీణ ప్రజల కోసం పోస్టల్ శాఖ అందిస్తున్న పోస్టల్ ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచి పోస్టు మాస్టర్ నూర్ మహమ్మద్, ఎంఏ బుడ్డన్న సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో పోస్టల్ సిబ్బంది, ఏజెంట్లతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులు, సాధారణ ప్రజలకు కూడా ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు పోస్టాఫీసుకు వచ్చి పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నారాయణస్వామి, సన్ని పాల్గొన్నారు.

సంకల్పం దృఢం.. సేవలు ఘనం

- 'హార్ట్ టు హెల్ప్' ట్రస్టు ద్వారా కార్యక్రమాలు
- అల్పాదాయంతోనే కార్యక్రమాలు విస్తృతం
- ఆదర్శంగా నిలుస్తున్న గిరిజన యువకుడు



ఓడీసీలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం



ప్లాస్టిక్ కవర్లు వద్దు - చేతి సంచులు ముద్దు అని పర్యావరణంపై ప్రచారం



కదిరిలో చర్మవృత్తి కళాకారులకు గొడుగులు అందిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: సేవ చేసేందుకు మనసుండాలిగానీ.. ధనవంతులై ఉండాల్సిన అవసరంలేదు.. నిరు పేద కుటుంబంలో పుట్టినా పొరుగు వారికి ఎంతోకొంత సాయపడొచ్చు.. అని నిరూపిస్తున్నాడు కదిరి రూరల్ మండలం చౌటతండాకు చెందిన గిరిజన యువకుడు మూడే రవినాయక్. చేతిలో డబ్బు లేకపోయినా సాయం చేయాలన్న సంకల్పం ఉంది.. అందుకు తగ్గట్టుగానే 'హార్ట్ టు హెల్ప్' అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి, కొద్దిపాటి సంపాదనతోనే సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

సమాజహితానికి ఖర్చు చేస్తున్నారు.

కదిరి రూరల్ మండలంలోని చౌటతండాకు చెందిన మూడే రవినాయక్ హైదరాబాదులోని విద్యుత్ శాఖలో కాంట్రాక్టు (అర్టిజన్) ఉద్యోగిగా పని చేస్తున్నాడు. 2011లో అప్పట్లో నెలకు వేతనం రూ. 9,300 వచ్చేది. ప్రస్తుతం రూ. 40 వేలు జీతం పొందుతున్నాడు. కొద్దిపాటి సంపాదనతోనే ప్రతి నెలా కొంత పొదుపు చేస్తూ సేవా కార్యక్రమాలు చేస్తున్నాడు.

సేవాకార్యక్రమాలంటే ఎంతో ఇష్టం

నిరుపేద కుంటుంబంలో పుట్టిన రవినాయక్ బాల్యమంతా కష్టాలతో సాగింది. తక్కువ కాలంలో ఎక్కువ సేవ చేయాలనే ఉద్దేశంతో రవినాయక్ 2014 జూలైలో 'హార్ట్ టు హెల్ప్' అనే ట్రస్టును ఏర్పాటు చేసి రెండు తెలుగు రాష్ట్రాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. స్వగ్రామమైన చౌటతండాతో పాటు గొల్లోల్ల చెరువు, చిగురుమాను తండా, కే బ్రాహ్మణపల్లిలో వృద్ధులకు దుప్పట్లు, బడిపిల్లలకు ప్లేట్లు, గ్లాసులు, నోటు పుస్తకాలు,అనాథ పిల్లలకు పుస్తకాలు, వాల్‌చార్ట్‌లు, పాఠశాలకు గోడ గడియారాలు, గర్భిణులకు పౌష్టికాహారం, పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. ప్రతినెలా 3 నుంచి 4 వేల వరకు సమాజహితానికి ఖర్చు చేస్తున్నారు. స్వగ్రామంలో 60 విద్యుత్ స్తంభాలకు దీపాలను అమర్చే బాధ్యతను తానే నిర్వహిస్తున్నాడు. స్వగ్రామంలోనే కాకుండా తాను పనిచేసే ప్రాంతంలో కూడా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. స్నేహితుల సాయంతో రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చడం లాంటి కార్యక్రమాలతో ముందుకెళ్తున్నాడు. ధనవంతులే సమాజ సేవ చేయాలనే ఆలోచన పక్కన పెట్టాలని, మనసుంటే మనకున్న ఆదాయంలోనే సమాజ సేవ చేసి చూపించవచ్చని చెపుతున్నాడు.

తెలిసిన వాళ్లతో సేవ చేయిస్తూ..

రవినాయక్ చేసేది చిరుద్యోగం. సేవా కార్యక్రమాలకు ఆ జీతం డబ్బులు చాలదు. దీంతో తన మిత్రులు , తెలిసిన వాళ్లు, సామాజిక సేవపై ఆసక్తి ఉన్నవారితో సైతం సేవా కార్యక్రమాలు చేసేలా చేస్తున్నారు. పేదల విద్యకు ఊతం ఇచ్చేలా పరీక్ష ఫీజు, పుస్తకాలు, నోట్ బుక్కులు, పెన్నులు తదితర విద్యాసామగ్రిని ఏటా అందిస్తూ వస్తున్నారు.

3 రంగాల్లో సేవా కార్యక్రమాలు

రవినాయక్ తన సేవా కార్యక్రమాలను 3 రంగాల్లో నిర్వహిస్తున్నారు. ఎడ్యుకేషన్, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, విద్యా రంగంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్ష ఫీజు విద్యాసామగ్రి అందజేయడం, ప్రైవేట్ టీచర్‌ను ఏర్పాటు చేసి సాయంకాలం పూట విద్యార్థులకు ట్యూషన్ చెప్పించడం లాంటి కార్యక్రమాలు చేస్తున్నాడు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించడం. అడవుల్లో సీతాఫలం విత్తనాలు నాటడం లాంటివి చేస్తున్నారు.

రాష్ట్ర ఉత్తమ పౌరుడిగా అవార్డు

రవినాయక్ చేస్తున్న సామాజిక సేవలకు గుర్తించిన ఏపీ స్టేట్ కల్చరల్ అవేర్‌నెస్ సొసైటీ రాష్ట్ర ఉత్తమ పౌరుడుగా అవార్డును ఇటీవల ప్రదానం చేసింది. వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలను అందించినందుకు గుర్తింపుగా ప్రతి ఏటా ఈ అవార్డును సొసైటీ ప్రదానం చేస్తుంది. 2016లో స్వామీ వివేకానంద ఎక్సలెన్స్ అవార్డు, 2017లో అర్పిత సాంస్కృతిక సేవా సంస్థతో ఆంధ్రరత్న అవార్డు పొందారు.



పర్యావరణ పరిరక్షణలో భాగంగా చవిటితండా అడవిలో పెంచుతున్న సీతాఫలం చెట్లు

మోసానికి కేరాఫ్ చంద్రబాబు



వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి: 'చంద్రబాబు మోసానికి కేరాఫ్. ఎన్నికలకు ముందు కుప్పలు తెప్పలుగా హామీలు గుప్పించి వాటిని సరిగా అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని' అని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. కూటమి పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పుట్టపర్తి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం 'వెన్నుపోటు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవ రెడ్డి మాట్లాడుతూ ప్రజలను మోసం చేయటం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యన్నారు. ఓ సారి మామాను వెన్నుపోటు పొడిచి అధికారంలో వచ్చారని, మిగిలిన మూడుసార్లు సాధ్యం కాని హామీలు, అక్రమ పొత్తులతో అధికారంలో చేపట్టారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలను మోసం ఎలా చేయాలని ఆలోచిస్తుంటారన్నారు. ఏడాది కాలంలోనే ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారన్నారని తెలిపారు. కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, పుట్టపర్తి పట్టణ, బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ, ఓడీచెరువు, అమడగూరు కన్వీనర్లు రవినాయక్, కొత్తకోట కేశప్ప, శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, జయప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దరాంపురం కేశప్ప, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మాజీ కన్వీనర్లు గంగాద్రి, సుధాకర్‌రెడ్డి, నరసారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సాయి, రైతు విభాగం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, పవన్, కేశప్ప, బుక్కపట్నం మండల బూత్ లెవల్ కమిటీ అధ్యక్షుడు పతంజలి, నీలూరి ఈశ్వర్, అర్బన్ రైతు విభాగం అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు భారతి, మైనార్టీ విభాగం అధ్యక్షుడు నిజాం, స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు మరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ నాయక్, అమర్‌నాథ్‌రెడ్డి, వీరభద్ర, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నగదు బదిలీ ప్రతిపాదన విరమించుకోవాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ప్రశాంతి నిలయం: ఎంఎల్ఎస్ పాయింట్లలో పని చేసే హమాలీలతో పాటు పేదలకు నష్టదాయకమైన నిత్యావసరాల పంపిణీ స్థానంలో నగదు బదిలీ చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సిఐటీయూ నాయకులు, కార్మికులతో కలసి కలెక్టర్ చేతన్‌కు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ లక్షలాది మంది కార్మికులు ఎంఎల్ఎస్ పాయింట్లలో పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. ప్రభుత్వం నగదు బదిలీ ప్రారంభిస్తే వారందరూ రోడ్డున పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా కోశాధికారి రామదాసు, మోమీన్, సుబ్రహ్మణ్యం, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించాలని నిరసన



మున్సిపల్ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని 34వ వార్డులోని ఎర్రకోట కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మహిళలు బిందెలతో మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించి, ధర్నా చేశారు. సోమవారం ప్రగతి శీల నారీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఎర్రకోట కాలనీలో సొంత ఇల్లు లేని అర్హులైన నిరుపేదలు సర్వే నంబర్ 1778-1లో ప్రభుత్వం భూమిలో ఇల్లు నిర్మించుకుని, నివాసం ఉంటున్నారు. కొన్ని రోజుల నుంచి తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, విద్యుత్ శాఖ అధికారులకు సమస్యలు విన్నవించినా పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి డ్రైనేజ్, మంచినీటి సరఫరా, వీధిలైట్లు, రోడ్లు తదితర సదుపాయాలు కల్పించాలని మహిళలు కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల నారీ సంఘం జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, ప్రసన్న, నరసమ్మ, లక్ష్మీనరసమ్మ, సరోజ, గంగోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పెనుకొండ రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులలో రసాయన ఎరువులు వాడకం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేష్ కృష్ణ, ఏపీఓ సంజీవరెడ్డి, న్యాచురల్ ఫార్మింగ్ అసోసియేట్ సభ్యుడు సాకప్ప పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవగ్రహాల ప్రతిష్టాపన



నవగ్రహాలను ప్రతిష్టించిన దృశ్యం

లేపాక్షి: మండలంలోని పులమతి పంచాయతీ పరిధిలోని పి.సడ్లపపల్లిలోని శివాలయంలో సోమవారం నవగ్రహ ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. కళాపూజ, కళాకర్షణ, కళాహోమం, ప్రాణప్రతిష్టాపన, శాంతి హోమం, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. హిందూపురం మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, సర్పంచ్ అశ్వత్థనారాయణ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి నాగభూషణ, గ్రామ పెద్దలు, ప్రజలు పూజల్లో పాల్గొన్నారు.

రామాలయానికి విరాళం



ఆలయ పనులకు విరాళం అందిస్తున్న పూల శ్రీనివాసులురెడ్డి తదితరులు

తలుపుల: మండలంలోని నూతనకాల్వ రామాలయ అభివృద్ధి కోసం కమిటీ సభ్యుడు ఓబుల రెడ్డికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసులురెడ్డి సోమవారం రూ.50 వేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండారెడ్డి, మండల ఉపాధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ యరమరెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, అగ్రిబోర్డు చైర్మన్ చెన్నకృష్ణారెడ్డి, నాయకులు గజపతిరెడ్డి , రోశిరెడ్డి, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తలుపుల: మండలంలోని గుండువారిపల్లికి చెందిన పోస్ట్‌మాన్ అశోక్ లివర్ సమస్యతో బాధపడుతున్నాడు. విషయాన్ని సర్పంచ్ మల్లినాయుడు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసులురెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే కదిరిలోని వారి స్వగృహంలో రూ.30 వేలు అందించారు. ఈ మొత్తాన్ని సర్పంచ్ మల్లినాయుడు స్థానిక నాయకులతో కలిసి బాధితుడికి సోమవారం అందించారు.

పదవీ విరమణ చేసిన సూపర్‌వైజర్‌కు సన్మానం

హిందూపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుదీర్ఘకాలం సమాచారశాఖలో డీపీఆర్‌ఓ ఆఫీస్ సూపర్‌వైజర్‌గా పనిచేసిన జింకల రామన్నను సన్మానించడం హర్షణీయమని పలువురు పాత్రికేయులు, వివిధ సంఘాల ప్రతినిధులు అన్నారు. పదవీ విరమణ పొందిన జింకల రామన్నను హిందూపురం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ మధ్య తరగతి కుటుంబానికి చెందిన రామన్న 14వ యేట పాముకాటుకు గురై కుడికాలు కోల్పోయారన్నారు. అయినా నిరుత్సాహ పడకుండా ఉన్నత కష్టపడి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించుకుని 31 ఏళ్లు సమాచారశాఖలో పనిచేస్తూ శ్రీసత్యసాయి జిల్లాలో పదవీ విరమణ పొందారన్నారు. ఆయన ఎంతో మందికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు రామ్‌ప్రసాద్, జాకబ్, గంగప్ప, సూర్య ప్రకాష్, నాగరాజు, అంజప్ప, రాజేష్, శివకుమార్, రమేష్, గిరీష్, ప్రకాష్, నాగేంద్ర, దాసప్ప, విద్యార్థి సంఘం నాయకులు బాబావలి పాల్గొన్నారు.

బడుల్లో మౌలిక వసతులు కల్పించండి

హిందూపురం టౌన్: పురపాలక సంఘ పరిధిలోని ఉన్నత పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మున్సిపల్ టీచర్ ఫెడరేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ కుమార్‌ను, కమిషనర్ మల్లికార్జునను కలిసి వినతిపత్రం అందించారు. ఎంటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దగిరి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు రంగనాయకులు, సామ్రాజ్యం, చంద్రశేఖర్, పెన్నోబులం, రమణ, కృష్ణమోహన్, రోహిణి, విజయ్‌కుమార్, ఎంటీఎఫ్ నాయకులు జనార్దన్, రామాంజినేయులు, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల వద్ద పడిగాపులు



ఈ-కేవైసీ వేసేందుకు బారులు తీరిన రైతులు

నల్లచెరువు: మండల కేంద్రంతోపాటు మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రైతులు వేలిముద్రలు వేయటానికి సోమవారం బారులుదీరారు. ఈ నెల 21 వరకే వేలిముద్రలు వేయడానికి సమయం ఉందని సిబ్బంది చెప్పడంతో రైతులు ఆయా రైతు సేవా కేంద్రాలకు భారీగా తరలివచ్చారు. కొన్ని చోట్ల సర్వర్ పని చేయక పోవడంతో వేలి ముద్రలు వేసేందుకు రైతులు పడిగాపులు కాయాల్సి వచ్చింది.

అధికారుల తప్పిదం.. రైతుకు అన్యాయం



రైతు నరసింహమూర్తి

పెనుకొండ రూరల్: ఒకే ఎల్‌పీ నంబర్ ఉమ్మడిగా ఆరుగురు రైతులకు ఉండటంతో తల్లికి వందనం పథకానికి దూరమయ్యారు. శెట్టిపల్లి గ్రామానికి చెందిన రైతు నరసింహ మూర్తి వివరాల మేరకు .. నరసింహమూర్తి భార్య ఈశ్వరమ్మ పేరు మీదగా 479-1లో 2 ఎకరాలు భూమి మాత్రమే ఉందన్నారు. తనతో పాటు గ్రామంలోని మరో ఐదుగురు రైతులకు సంబంధించి ఒకటే ఎల్‌పీ నంబర్‌లో రెవెన్యూ రికార్డుల్లో నమోదైందన్నారు. తన పేరు మీద పది ఎకరాలు పైబడి భూమి ఉన్నట్లు చూపిస్తోందని పేర్కొన్నారు. తనకు నలుగురు పిల్లలు ఉండగా అందులో, ముగ్గురు తల్లికి వందనం పథకానికి అర్హులన్నారు. అయితే భూమి ఎక్కువ ఉందనే కారణంతో తమ పేర్లు అనర్హత జాబితాలోకి వెళ్లిపోయాయన్నారు. రెవెన్యూ అధికారలు తప్పిదం వల్లనే తాము పథకానికి దూరమయ్యామని, సమస్య పరిష్కరించాలని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

తాడిమర్రి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరంగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీలు, కో-ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. ప్రభుత్వ అధికారులు తమ శాఖలకు చెందిన సంక్షేమ పథకాలు, రాయితీలు తదితర నివేదికలతో రావాలని సూచించారు.

పిల్లలను బడిలో చేర్పించాలి



హాజరు రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 ప్రసూన్‌కుమార్ నాయుడు

చెన్నేకొత్తపల్లి: బడిఈడు పిల్లలందరూ బడిలో చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి-2 ప్రసూన్‌కుమార్ నాయుడు సూచించారు. సోమవారం మండల పరిధిలోని న్యామద్దెల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు సరఫరా చేసిన పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రిని పంపిణీ చేశారా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందించాలని హెచ్ఎంకు సూచించారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం రూరల్: స్థానిక మోడల్ స్కూల్ (గుట్టకిందపల్లి)లో ఇంటర్మీడియట్, అలాగే 8వ, 9వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మశ్రీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్‌లో నేరుగా అడ్మిషన్లు ఉండవని వెల్లడించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి మాత్రమే ప్రవేశాలు ఉంటాయన్నారు. ఈనెల 20వ తేదీలోపు 8, 9 తరగతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని ఆర్డీఓ మహేష్ తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ సమావేశ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లోని ప్రజలు తమ సమస్యలు తెలుపుకునేందుకు వస్తున్నారన్నారు. ప్రజల నుంచి ఆరు దరఖాస్తులు వచ్చాయని వాటిని విచారించి సత్వరమే పరిష్కరించేలా సంబంధిత మండలాల అధికారులను ఆదేశించామని తెలిపారు.

ఆలయ ఈఓగా మురళీకృష్ణ



పాలపాటిదిన్నె నూతన ఈఓ మురళీకృష్ణకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

నల్లచెరువు: పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయ నూతన ఈఓగా మురళీకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తాడిపత్రి నియోజకవర్గంలోని ఎ.కొండాపురం గ్రూపు ఆలయాల నుంచి బదిలీపై వచ్చారు. నూతన ఈఓకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారికి నూతన ఈఓ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో ఈఓగా పనిచేసిన రవీంద్రరాజు తలకోనకు బదిలీ అయ్యారు.